క్లుప్తంగా

వృద్ధులకు పాదరక్షల పంపిణీ



పాదరక్షలు అందజేస్తున్న సతీష్, శ్రీకర్

రాజమహేంద్రవరం సిటీ: వృద్ధులు, నిరాశ్రయులను ఆదుకోవడంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ ప్రశంసనీయమైన సేవలు అందిస్తోందని జీవిత బీమా సంస్థ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు సతీష్ ప్రయాగ అన్నారు. ఆదివారం స్థానిక లాలాచెరువులో గల స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాదరక్షల పంపిణీలో సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హైదరాబాదులో కంప్యూటర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న శ్రీకర్ ఆరేళ్లుగా ఏటా వృద్ధులకు పాదరక్షలు సమకూర్చడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సుమారు 100 మంది వృద్ధులకు 20వేల రూపాయల విలువైన పాదరక్షలను శ్రీకర్, సతీష్ చేతుల మీదుగా అందించారు.

విజేతలకు బహుమతులు

ధవళేశ్వరం: శ్రీరామనవమిని పురస్కరించుకొని వివేకానంద మిత్రమండలి సభ్యులు ఇటీవల నిర్వహించిన రామాయణం పోటీ పరీక్షల్లో విజేతలకు ఆదివారం బహుమతులను ప్రదానం చేశారు. స్థానిక సత్తిరాజు ఫంక్షన్ హాల్‌లో బహుమతులను అందజేశారు. తొలుత యోగా ఆసనాలు ,భక్తి పాటలను విద్యార్థులు ఆలపించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి శ్రీవెంకటసత్యసాయి గ్యాస్ ఏజెన్సీస్ అధినేత వేగిశెట్టి కోదండరామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేగిశెట్టి కోదండ రామారావు, కార్యక్రమ నిర్వాహకులు, యోగా గురువు తలాటం సూర్యప్రకాశరావు, ఒంటిద్దు స్వామి, డాక్టర్ జి కొండలరావు, రామునాయుడు చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కంబాలచెరువు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం త్రీటౌన్ పోలీస్ పరిధిలో చోటు చేసుకుంది. కొంతమూరుకు చెందిన మందార బాబూరావు (60) శానిటోరియంలోని చర్చి వద్ద తన భార్యను మోటారు సైకిల్‌పై దింపేందుకు వెళ్లాడు. ఆమెను చర్చి వద్ద దింపి తిరిగి కొంతమూరు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన బొలెరా వాహనం బాబూరావును ఢీకొట్టింది. దీంతో అతను మోటారు సైకిల్ పై నుంచి పడిపోయాడు. అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు అతను అప్పటికే పోలీసులు మృతిచెందినట్లు తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ : సోమవారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ ఆదివారం ప్రకటించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ కువిశేషపురం, వాటర్ ట్యాంక్స్ ఏరియా, జడ్జి గారి రోడ్డు, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ఏరియా, ప్రియదర్శిని హాస్పిటల్ ఏరియా, ప్రతిభ స్కూల్, సెంట్రల్ జైల్ పరిధిలో కొన్ని ప్రాంతాలలో ప్రభావం ఉంటుందన్నారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు జేఎన్ రోడ్ , ఏకేసీ కాలేజ్ రోడ్, శ్రీనివాస నగర్, వికాస్ నగర్, సాయి నగర్, కోకభాస్కరమ్మ నగర్, బ్యాంక్ ఆఫ్ బరోడా ఏరియా, ఏవీ అప్పారావు రోడ్, క్రీమ్ స్టోన్ సెంటర్ పరిసర ప్రాంతాలలో సరఫరా ఉండదన్నారు.ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పోస్టల్ కాలనీ, అఫీషియల్ కాలనీ, సోమాలమ్మ టెంపుల్ రోడ్, శ్యామలనగర్, మల్లినానగర్, ఎస్‌వీజీ మార్కెట్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సుందరీకరణకు నిర్లక్ష్యం గ్రహణం

- నిర్వహణ కరవు
- పట్టించుకోని అధికారులు



పార్కులో పని చేయని గడియారం

రాజమహేంద్రవరం సిటీ: అభివృద్ధి, సుందరీకరణ కార్యక్రమాలపై నగరంలో ఏ విధమైన శ్రద్ధ కనబరచకపోవడం నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. నగరంలో ప్రసిద్ధి చెందిన జవహర్‌లాల్ నెహ్రూ రోడ్‌లో సుందరీకరణలో భాగంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన కప్పు సాసర్ మాన్యుమెంట్ నిరుపయోగంగా మారిపోయింది. జగ్గులోని వాటర్ కప్పులో పడేవిధంగా ఏర్పాటు చేసినా మోటారు పనిచేయకపోవడంతో సందర్శకులు విస్తుపోతున్నారు. సుమారు మూడు నెలలుగా ఇది పనిచేయకపోయినప్పటికీ నగరపాలక సంస్థ అధికారులు అటువైపు దృష్టి సారించకపోవడంపై నగర ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కప్పు సాసర్‌పై మట్టి పేరుకు పోయింది. మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రత్యేక శ్రద్ధతో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ కప్పు సాసర్ నిర్వహణపై నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పర్యవేక్షించాల్సిన అధికారులు దానివైపు కన్నెత్తి చూడటం లేదు. మూడు నెలలుగా మోటారు పనిచేయకపోవడంతో కుండీలో నీరు దుర్గంధం వెదజల్లుతోంది. జవహర్‌లాల్ నెహ్రూ రోడ్‌లోని ఆంధ్రకేసరి సెంట్రినరీ కాలేజీ సెంటర్లో ఏర్పాటు చేసిన ఈ కప్పు సాసర్ పై అధికారులు దృష్టి సారించి నిత్యం పని చేసే విధంగా చర్యలు చేపట్టాలని సందర్శకులు విజ్ఞప్తి చేస్తున్నారు. పరమహంస యోగానంద మార్గ్.. హ్యాపీ స్ట్రీట్ గా నగర ప్రజల మనలను పొందింది. పరమహంస యోగానంద మార్గ్‌లో గల పార్కుకు సైతం హ్యాపీ స్ట్రీట్ పార్కుగా నామకరణం చేశారు. ఈ పార్కు ముఖద్వారం వద్ద ప్రజలను ఆకట్టుకునే విధంగా గడియారాన్ని ఏర్పాటు చేశారు. మూడు నెలలుగా ఈ గడియారం పనిచేయడంలేదు. అయినప్పటికీ నగరపాలక సిబ్బంది పట్టించుకోవడం లేదు. గత **నెలలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హ్యాపీ స్ట్రీట్ పార్క్ పేరును నందమూరి తారక రామారావు పార్క్‌గా మార్చి వేశారు. పేరు మార్పు చేసే సమయంలో సైతం గడియారం** పనిచేయకపోయినా నగరపాలక సంస్థ అధికారులు దాని వైపు కన్నెత్తి చూడలేదు. పార్కు పేరు మార్చే సమయంలో సందర్శించిన సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సైతం గడియారం పనిచేయకపోవడంపై దృష్టి సారించకపోవడం విడ్డూరం. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు నగరంలో సుందరీకరణ పనులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సుందరీకరణ కోసం ఏర్పాటు చేసినవి ఏడాది పూర్తి కాకముందే నిర్వహణ లేక పాడైపోవడంతో నగరపాలక సంస్థ అధికారులు సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ కమిషనర్ వీటిపై ప్రత్యేక దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

అధికారులు చర్యలు చేపట్టాలి



మూడు నెలలుగా గడియారం పనిచేయట్లేదు అధికారులు దాని వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇటీవల పార్కును సందర్శించిన ఎమ్మెల్యే సైతం గడియారంపై దృష్టి సారించకపోవడం విడ్డూరం. ఎమ్మెల్యే వస్తున్నాడని తెలిసి కూడా గడియారానికి మరమ్మతులు చేయించకపోవడంలో నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం స్పష్టమవుతుంది. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన వస్తువులను నిరంతరం పనిచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– బీవీ రమణారెడ్డి, రాజమహేంద్రవరం

నిర్లక్ష్యం తగదు



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సుందరీకరణ పనులపై అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే జవహర్‌లాల్ నెహ్రూ రోడ్‌లో ప్రాచుర్యం పొందిన కప్పు సాసర్ మూడు నెలలుగా పని చేయకపోయినా దాన్ని మరమ్మతులు చేయించకపోవడం దారుణం. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సుందరీకరణపై చర్యలు చేపట్టాలి

–కేవీపీ దేవీప్య, రాజమహేంద్రవరం

టీడీపీ సభ్యత్వ కార్డు ఇవ్వలేదని..

రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ సభ్యత్వ కార్డు ఇవ్వలేదని కన్వీనర్‌ను దూషించడంతో అడ్డువచ్చిన తమ్ముడు, తండ్రిపై దాడి చేసిన ఘటన ఆదివారం సాయంత్రం హుకుంపేట డిబ్లాకులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం హుకుంపేట డిబ్లాకు వినాయకుడి గుడి వద్ద ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో టీడీపీ కన్వీనర్ గీతా నాగప్రసన్న టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్నారు. ఆ సమయంలో అదే ప్రాంతానికిచెందిన వాసంశెట్టి రమేష్, ఎలీషాలు ఇద్దరు వచ్చి తమకు టీడీపీ సభ్యత్వ కార్డులు ఇవ్వాలని అడిగారు. దీంతో నాగప్రసన్న మీ కార్డులు తన వద్ద లేవని వేరొకరి వద్ద ఉన్నాయని తెలిపారు. దీంతో రమేష్,ఎలీషాలు వంద కట్టించుకున్నప్పుడు కార్డు ఇవ్వడం తెలీదా అంటూ అసభ్య పదజాలంతో దూషించడంతో అడ్డువచ్చిన ఆమె తమ్ముడిపై దాడి చేశారు. ఈలోగా నాగప్రసన్న ఆమె తండ్రికి ఫోన్ చేసి పిలిపించింది. దీంతో ఆ ప్రదేశానికి వచ్చిన నాగప్రసన్న తండ్రి ఎందుకు గొడవపడుతున్నారని అడుగ్గా అతనిపై కూడా దాడిచేశారని నాగప్రసన్న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్‌లో సత్య చారిటబుట్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రంను జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మార్నివాసుదేవరావు ప్రారంభించి మజ్జిగను పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు తమ్మా రవి, సెక్రటరీ పి.సాయిదుర్గ పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి కల్యాణం



సీతారాములను దర్శించుకున్న చందన నాగేశ్వర్



భక్తులకు అన్నం వడ్డిస్తున్న వేణుగోపాలకృష్ణ

ధవళేశ్వరం: శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాలు ధవళేశ్వరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక లాక్ లైన్ క్వార్టర్స్ వద్ద జరిగిన సీతారాముల వారి కల్యాణ మహోత్సవాలకు మాజీ మంత్రి ,వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్పర్సన్ షర్మిళారెడ్డి సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్యారేజీ క్వార్టర్స్ రామాలయం వద్ద జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ భక్తులకు స్వయంగా వడ్డించారు. అంతకుముందు కల్యాణ మహోత్సవాల్లో రిటైర్డ్ టెక్నికల్ ఆఫీసర్ సాగి సూర్యనారాయణరాజు దంపతులు పీటలపై కూర్చున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తడాల చక్రవర్తి, దేవులపల్లి సరితారాణి పాల్గొన్నారు. గొల్లపేట రామాలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు సాధనాల చంద్రశేఖర్(శివ) ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. నారపురెడ్డి మురళి,కామన సత్యనారాయణ,వైవి సత్యనారాయణ, ఇందల ప్రకాష్ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కి పునర్వైభవం రావాలి

- మార్గాని ఎస్టేట్స్‌లో కన్నుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం
- మళ్లీ రామరాజ్యం రావాలి : మాజీ ఎంపీ భరత్‌రామ్
- హాజరైన ఉండవల్లి, రౌతు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు



మాజీ ఎంపీ భరత్ దంపతులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



పోలీసు క్వార్టర్స్ సీతారామాలయంలో జరిగిన కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎస్పీ నరసింహకిషోర్ తదితరులు

సీటీఆర్ఐ: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం స్థానిక వి.ఎల్.పురం మార్గాని ఎస్టేట్స్ మాజీ ఎంపీ కార్యాలయంలో మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్, మోనా దంపతుల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. పెద్దింటి వెంకట సుబ్బారాయుడు, శ్రీ అమ్మఒడి సేవా తరంగిణి వ్యవస్థాపక కార్యదర్శి అలికాని సత్య శివ కుమార్ చక్కని వ్యాఖ్యానంతో శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం జరిపించారు. దాదాపు రెండుగంటల పాటు కల్యాణోత్సవం జరిగింది. మాజీ ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ సీతారాములు జగతికి ఆదర్శమని అటువంటి పుణ్య దంపతులకు 50 ఏళ్లుగా తమ కుటుంబం శ్రీరామనవమి నాడు కల్యాణోత్సవం జరిపిస్తోందని అన్నారు. రామరాజ్యం రావాలని, ఆంధ్రప్రదేశ్‌కి పునర్వైభవం రావాలని భరత్ ఆకాంక్షించారు. బీసీ రాష్ట్ర నాయకులు మార్గాని నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు రౌతు సూర్యప్రకాశరావు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, చాంబర్ మాజీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్, వస్త్ర వ్యాపార ప్రముఖులు రమేష్ హేమ్ దేవ్ హాజరై , పీటలపై కూర్చున్న భరత్ దంపతులను ఆశీర్వదించారు.

అన్నపూర్ణమ్మపేటలో...

స్థానిక అన్నపూర్ణమ్మ పెద్ద వీధిలో నగర నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. నారాయణపురం గోపాల్ నగర్ రామాలయం సెంటర్లోని శ్రీసీతారాముల ఆలయంలో స్వామి వారి కల్యాణమహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతంపేటలోని 170 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీరామాలయంలో శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భద్రాద్రిలో నిర్వహించినట్లుగా ఇక్కడ భక్తుల మధ్య కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

శ్రీరాముని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం ..

నగరంలో 29 ప్రాంతాల్లో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరై సీతారాములను దర్శించుకున్నారు. జాంపేట రిజర్వు పోలీసు క్వార్టర్స్ లోని శ్రీ కోదండరామ ఆలయంలో జరిగిన శ్రీరామనవమి ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎస్పీ నరసింహకిషోర్ పాల్గొన్నారు. జాంపేట రిజర్వు పోలీసు క్వార్టర్స్‌లో జరిగే సీతారాముల కల్యాణానికి తయారు చేసే పానకం కోసం ఆదిరెడ్డి కుటుంబం 100 కేజీల బెల్లం ఇచ్చింది.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



కడియపులంకలో రామాలయాన్ని సందర్శించిన మంత్రి దుర్గేష్



బొమ్మూరు ఎలక్ట్రికల్ కొండపై సంతాన సీతారామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అచ్యుతాచారి, చైతన్యవర్మ దంపతులు



సంతాన శ్రీసీతారామాలయంలో సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు



ముసలమ్మవారి ఆలయం వద్ద పానకం తయారీకి బెల్లాన్ని సిద్ధం చేస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ఎలక్ట్రికల్ కొండపై బొమ్మూరు భద్రాద్రిగా పేరొందిన సంతాన సీతారాముల ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. విద్యుత్‌శాఖ ఏడీఈ అచ్యుతాచారి, సవిత, విద్యుత్‌శాఖ రూరల్ ఈఈ శ్రీధర్‌వర్మ కుమారుడు చైతన్యవర్మ, లావణ్య దంపతులు పీటలపై కూర్చుని కల్యాణకర్తలుగా వ్యవహరించారు. భక్తులు సీతారాములు కళ్యాణంను తిలకించారు. అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త చింతా సత్యనారాయణరెడ్డి, విద్యుత్‌శాఖ సీజీఎం టీవీఎస్ఎన్ మూర్తి, విశ్రాంత డీఆర్‌వో మారిశెట్టి జితేంద్ర పాల్గొన్నారు. హుకుంపేట రావి చెట్టు సెంటర్‌లోని కోదండరామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది.

తొర్రేడులో..

తొర్రేడు గ్రామంలో 106సంవత్సరాల చరిత్ర కలిగిన రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. మల్లిన శ్రీహరి దంపతులు ఆధ్వర్యంలో వేదపండితుల వేదమంత్రాలతో సీతారాములు కల్యాణం నిర్వహించారు. ముమ్మారెడ్డి వెంకటేశ్వరరావు దంపతులు భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. దండమూడి చంద్రం, దండమూడి ప్రమీల, భక్తులు పాల్గొన్నారు.

తరలివచ్చిన భక్తులు

కడియం: మండలంలోని వివిధ గ్రామాల్లో వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు ఆదివారం కన్నుల పండువగా జరిగాయి. స్వామివారి కళ్యాణోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. నిర్ణీత ముహూర్తానికి వేదపండితులు కల్యాణ తంతును నిర్వహించారు. కడియపులంక, బుర్రిలంక గ్రామాల్లోని పలు రామాలయాలను మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. అన్న సమారాధనలను ప్రారంభించారు. వీరవరంలోని పురాతన శ్రీ కోదండరామాలయంలో కల్యాణోత్సవాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. దుళ్ళ, మాధవరాయుడుపాలెం, మురమండ, దామిరెడ్డిపల్లి, వేమగిరి, పొట్టిలంక తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. ఆయా గ్రామాల్లో పెద్ద ఎత్తున అన్న సమారాధనలు జరిగాయి. పానకం, వడపప్పు ప్రసాదాన్ని భక్తులకు అందించారు. కడియపులంకలోని ముసలమ్మవారి ఆలయం వద్ద పానకం పంపిణీని మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. పానకం, వడపప్పు తయారీలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

బాబూ జగజ్జీవన్‌రామ్ మనువడు డాక్టర్ అన్షుల్ అభిజిత్



విలేకరులతో మాట్లాడుతున్న జగ్జీవన్‌రామ్ మనువడు డాక్టర్ అన్షుల్ అభిజిత్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన మనువడు డాక్టర్ అన్షుల్ అభిజిత్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక షెల్టాన్ హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో సమిశ్రగూడెం, పెద్దేవంగ్రామాల్లో శనివారం జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఆయన ఐదవ తరగతి చదువుతున్నప్పటి నుంచే ఉద్యమబాట పట్టడం జరిగిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలోను, అణగారిన వర్గాల కోసం అనేక ఉద్యమాలలో పాల్గొన్నారన్నారు. తన తల్లి మీరాకుమారి 2007లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలను 20 ఏర్పాటు చేశారన్నారు. ఆరుగొలను జాస్మిన్, డాక్టర్ తవిటికి వెంకట శ్రీధర్,మద్దాల ఏసుపాదం, పసలపూడి బోసు పాల్గొన్నారు.

బీజేపీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేయాలి



బీజేపీ పతాకాన్ని ఎగురవేస్తున్న రొంగల గోపీ శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: బీజేపీ సిద్ధాంతాలకు అనుగుణంగా అందరూ పనిచేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీశ్రీనివాస్ అన్నారు. ఆదివారం రూరల్ మండలం–2 బీజేపీ అధ్యక్షుడు మట్టా నాగబాబు ఆధ్వర్యంలో పిడింగొయ్యి, హుకుంపేట, శాటిలైట్‌సిటీ గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. రొంగల గోపీశ్రీనివాస్, మట్టానాగబాబు, తనుబుద్ధి సూర్యభాస్కరరావు,ఎన్‌విబిఎస్ ఆచారి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెం శ్రీనివాస్, వడ్డి సూర్య చంద్ర, సిధాని వెంకట్, ముద్రగడ సూర్య చంద్ర మోహన్ పాల్గొన్నారు.


కాతేరులో...

కాతేరు మల్లయ్యపేటలో రూరల్ మండలం–1 బీజేపీ అధ్యక్షుడు నాగంశివ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, రూరల్ బీజేపీ కోకన్వీనర్ యానావు యేసు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. జీఎస్‌కే సురేష్, పురుషోత్తమశాస్త్రి, పిచ్చుక రాంబాబు, స్వామిసూరికిరణ్ పాల్గొన్నారు.

కడియంలో..

కడియం: మండల కేంద్రమైన కడియంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. పలువురు పాల్గొని పార్టీ లక్ష్యాలను గురించి వివరించారు. వేమగిరి, కడియపులంక, దుళ్ళ, మురమండ, వీరవరం గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. రూరల్ కన్వీనర్ ఆకుల శ్రీధర్, పార్టీ నాయకులు పెనుమాక శేషగిరి, కే. వేంకటేశ్వరరావు, గుర్రాల రామ్మోహన్, చిక్కాల శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా హోమాలు



మహాకాళేశ్వరాలయంలో హోమం నిర్వహిస్తున్న దండుమేను వెంకటసుబ్బారావు, బాలమాలతీదేవి దంపతులు




మహాకాళేశ్వరునికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేటలోని మహాకాళేశ్వరాలయం (మరో ఉజ్జయిని)లో తృతీయ వార్షికోత్సవం సందర్భంగా రెండవరోజు ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. రోటరీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పట్టపగలు వెంకట్రావు రెండవ అల్లుడు దండుమేను వెంకటసుబ్బారావు, బాలమాలతిదేవి దంపతులు ఉదయం నుంచి విఘ్నేశ్వరపూజ, ప్రాంగణ పరివేష్టిత దేవతముల మంత్రహోమాలు, మండపారాధనలు, వాస్తు హోమం ,మూలమంత్రహోమాలు, నీరాజన మంత్రపుష్పములు, వేదస్వస్తి నిర్వహించారు. ముందుగా మహాకాళేశ్వరాలయంలో సీతారాముని కల్యాణం జరిపించారు. ఉదయం నుంచి భక్తులు మహాకాళేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించారు. సోమవారం శనిభగవానుడి శిఖర యంత్రస్థాపన, మహాకాళేశ్వర స్వామివారికి అన్నాభిషేకము, మహాపూర్ణాహుతి, శివకల్యాణము, మహా అన్నసమారాధన జరుగుతుందని ఆలయ ధర్మకర్తల కమిటీ తెలిపింది.

పోలవరం జీవం తీసేస్తున్నారు

- ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్లు ఉండాల్సిందే
- కాంగ్రెస్ పోలవరం ప్రాజెక్టు, నిర్వాసితుల అధ్యయన కమిటీ చైర్మన్ మార్టిన్ లూథర్, డీసీసీ అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మార్టిన్ లూథర్, విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవనాడి అయిన ప్రాజెక్టులో జీవం తీసేశారని పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల అధ్యయన కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మార్టిన్ లూథర్, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే.విశ్వేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పోలవరంప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు తగ్గించడం వల్ల 194 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం నుంచి 114 టీఎంసీలకు పరిమితం చేసి ప్రాజెక్టు స్వరూపాన్ని పూర్తిగా మార్చేశారని మండిపడ్డారు. 22 లక్షల ఎకరాల పాత ఆయకట్టు స్థిరీకరణకు, 8 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు మహానేత వైఎస్సార్ ఆశించిన లక్ష్యాన్ని నీరుగార్చే కుట్రలు చేస్తున్నారని కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. 41.15 మీటర్ల ఎత్తుకి, రూ.30,436 కోట్ల బడ్జెట్ అంచనాలను కేంద్రం ఆమోద ముద్ర వేస్తే,45.72 మీటర్ల ఎత్తులో కట్టి తీరుతాం అని అసెంబ్లీ వేదికగా కూటమి ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందంటూ ధ్వజమెత్తారు. నిర్వాసితులకు ఇంతవరకు ఆర్ ఆర్.ప్యాకేజీ 20 శాతం కూడా అందలేదన్నారు. ప్రాజెక్టు ఎత్తు 41.15 మీటర్లకు తగ్గిస్తే భూములిచ్చిన 98 వేలమంది నిర్వాసితుల్లో 19 వేలమంది మాత్రమే నిర్వాసితులు అవుతారన్నారు. మిగతా 78 వేలమంది నిర్వాసితులకు ఆర్.ఆర్. ప్యాకేజీ అందదని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ శ్రీనివాస వడయారు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్లా షరీఫ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోత శారద, నిడదవోలు కోఆర్డినేటర్ కారంగి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.